క్లుప్తంగా

శ్రీవారి సన్నిధిలో భారీ అన్నసమారాధన



అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న ట్రస్ట్ బోర్డు సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్ర రావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల ముగింపును పురస్కరించుకుని శనివారం ఆలయంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సుమారు 3 వేల మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. తొలుత స్వామి వారికి విశేష పూజలు, ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాన్ని దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి ఆంధ్ర రవిశంకర్ పర్యవేక్షించారు.

ఎస్సీ వర్గీకరణ కోరుతూ వినతి



బీజేపీ నేత సుధాకర్ కృష్ణకు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఏలూరు (టూటౌన్): ఎస్సీ వర్గీకరణ బిల్లును వచ్చే పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టేవిధంగా చొరవ చూపాలని కోరుతూ బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు సుధకర్ కృష్ణ కు ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం వినతి పత్రం అందజేశారు. అశోక్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బీజేపీ నాయకులు సుధాకర్ కృష్ణ, గాది రాంబాబు, నెరుసు నెలరాజులను మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బయ్యారపు రాజేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్, జిల్లా కోకన్వీనర్ కాశీ కృష్ణ, ఎంఎస్‌పీ నాయకులు ఇనపర్తి మాధవన్, యర్రా నాగమల్లేశ్వరరావు, మద్దాల తిరుపతి రావు, చొదిమెల్ల వీరయ్య, కొలుకుపాము ఏసు తదితరులు కలిశారు.

వినతుల స్వీకరణ

దెందులూరు: ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఇళ్ల స్థలాలు, స్వయం ఉపాధి, వ్యక్తిగత అవసరాలు, ఇతర అవసరాలపై వినతులు అందజేశారు. ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బందితో సమస్యలను నమోదు చేయించి పరిష్కారానికి అధికారులకు సిఫార్సు చేశారు.

హెల్మెట్ ధారణ.. ప్రాణాలకు రక్షణ

- రోడ్డు నిబంధనలపై అవగాహన అవసరం
- ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ



హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ, పోలీస్ అధికారులు



పాతబస్టాండ్ వద్ద పాల్గొన్న పెరికె వరప్రసాదరావు

ఏలూరు టౌన్: హెల్మెట్ ధారణ.. ప్రాణాలకు రక్షణ అనే నినాదంతో ద్విచక్రవాహన చోదకుల్లు చైతన్యం తేవాలని ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ అన్నారు. 34వ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం ఏలూరు అమీనాపేటలోని సురేంద్రచంద్ర బహుగుణ స్కూల్ ఆవరణ నుంచి పోలీసులు, రవాణా శాఖ సంయుక్తంగా భారీ ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్స్ ధరించి మోటారు సైకిళ్లపై చేపట్టిన ఈ ర్యాలీని జిల్లా ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ మాట్లాడుతూ రహదారి ప్రమాదాల్లో అత్యధికంగా మోటారు సైకిళ్లపై ప్రయాణించేవారే ఉంటున్నారని, ఈ ప్రమాదాల బారిన పడుతూ విలువైన ప్రాణాలు కోల్పోవటం బాధాకరమని అన్నారు. క్షతగాత్రులు ప్రాణాలు, శారీరక అవయవాలు కల్పోవటంతో వారి కుటుంబాలకు తీరని నష్టం వాటిల్లుతుందని తెలిపారు. జాతీయ, రాష్ట్ర రహదారుల్లో ప్రమాదాల నివారణకు జిల్లా వ్యాప్తంగా బ్లాక్ స్పాట్‌లను గుర్తించామన్నారు. జాతీయ రహదారుల నుంచి క్రాస్ రోడ్స్ వద్ద ప్రజలకు అవగాహన కల్పించేందుకు రబ్బర్ పెయింటింగ్ చేసినట్లు తెలిపారు. రాబోయే కాలంలో జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. విద్యార్థి దశ నుంచే రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ర్యాలీలో ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు, ఆర్టీఓ కె.శ్రీహరి, ఏఆర్ డీఎస్పీ కృష్ణంరాజు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.విజయరాజు, ఎస్‌బీ సీఐ వి.రవికుమార్, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.స్వామి, జి.ప్రసాద్, వైఎస్‌వీ కల్యాణి, ట్రాఫిక్ సీఐలు దుర్గాప్రసాద్, పి.చంద్రశేఖర్, ఆర్ఐలు కృష్ణంరాజు, ఎం.రాజా, ట్రాఫిక్ ఎస్సై శ్రీధర్, ఆర్టీఓ ఏఓ ధనలక్ష్మి, ఎం.రాము, డీటీఆర్‌బీ ఎస్సై కె.రాంబాబు, వన్‌టౌన్ ఎస్సై రామకృష్ణ, కె.ప్రసాద్, ఎస్.శంకర్ తదితరులు ఉన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రాధాన్యత

ఏలూరు (టూటౌన్): రోడ్డు ప్రమాదాల నివారణకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రోడ్డు సేఫ్టీ ఎన్జీఓ అధ్యక్షుడు పెరికె వరప్రసాద రావు అన్నారు. జాతీయ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని రోడ్ సేఫ్టీ ఎన్జీఓ, సెయింట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ సంయుక్తంగా స్థానిక పాతబస్టాండ్ ఆటో సెంటర్లో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వరప్రసాదరావు మాట్లాడుతూ రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్, శిక్షణ ద్వారానే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చున్నారు. డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అన్ని వాహనాలకు ఇన్సూరెన్స్ చేయాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రతి డ్రైవర్ వారానికి ఒకసారి బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకుని ఆరోగ్య సూత్రాలు పాటించాలని అన్నారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు భీమవరపు బాబ్జి, కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, రామకృష్ణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కూలీకీ 100 రోజుల పని దినాలు



శ్రీపర్రులో ఫీడర్ చానల్ అభివృద్ధి పనుల వివరాలను పరిశీలిస్తున్న పీడీ రాంబాబు

ఏలూరు రూరల్: ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి కూలీకీ కనీసం 100 రోజులు పని కల్పించాలని ఉపాధి హామీ పథకం ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.రాంబాబు అన్నారు. శనివారం ఆయన ఏలూరు మండల గ్రామాల్లో ఉపాధి పథకం పనితీరు పరిశీలించారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి హామీ పథకం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, కూలీల సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. పంట కాలువ, ఫీడర్ చానల్స్ అభివృద్ధి చేస్తే, వ్యవసాయం, చేపల సాగు మరింత వృద్ధి చెందుతుందని వివరించారు. డ్రెయినేజీ, సీసీరోడ్లు తదితర పనులు ఉపాధి పథకం ద్వారా చేపట్టాలన్నారు. ఆయన పలు అభివృద్ధి పనులు పరిశీలించారు. ఏపీఓ కిషోర్‌కుమార్, ఈసీ రమేష్‌కుమార్, టీఏ విజయ్‌కుమార్, బీఎఫ్‌టీ నాని, నాగలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్లు చందు, కృష్ణ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి రామ్మూర్తి కృషి ఫలితమే



రామూర్తికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): దేశంలోని విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి, వీరిని బీసీల్లో చేర్పించడానికి అవిరళ కృషి చేసిన వ్యక్తి గానాల రామూర్తి అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి అన్నారు. రామూర్తి జయంతిని పురస్కరించుకుని స్థానిక వన్ టౌన్‌లోని సంఘ కార్యాలయంలో శనివారం ఆయనకు పలువురు బీసీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. రాజగోపాలాచారి మాట్లాడుతూ 1892 జనవరి 21న రాజమహేంద్రవరంలో జన్మించిన రామూర్తి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనమండలిలో ఎమ్మెల్సీగా ఉంటూ విశ్వబ్రాహ్మణుల భవిష్యత్ కోసం అవిరళంగా కృషి చేశారని గుర్తుచేశారు. 1919లో భారత విశ్వకర్మ ఫెడరేషన్ ఏర్పాటు చేసి దేశం నలుమూల తిరిగి విశ్వబ్రాహ్మణుల స్థితిగతులు అధ్యయనం చేసి వారిని బీసీల్లో చేర్పితేనే అభివృద్ధి చెందుతారని గుర్తించిన మహనీయుడని కొనియాడారు. మద్రాసు విశ్వవిద్యాలయం 1933లో ఆయనకు రావు సాహెబ్ బిరుదుతో సత్కరించిందన్నారు. నేడు విశ్వబ్రాహ్మణులు విద్య, ఉద్యోగాల్లో రాజకీయపరంగా అవకాశాలు దక్కుతున్నాయంటే రామ్మూర్తి కృషి ఫలితమేనని వివరించారు. విశ్వబ్రాహ్మణ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ లక్కోజు గోపి, వడ్రంగి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కెల్ల వెంకట రమణ, యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కొత్తల శివ, నల్లపాటి కామేశ్వరరావు, గోరస మణికుమార్, నాని బీసీ సంక్షేమ సంఘం యువజన నాయకులు రాఘవ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల పరిశీలన



పోణంగిలోని టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఏలూరు (టూటౌన్): స్థానిక పోణంగిలో ఉన్న టిడ్కో ఇళ్లను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తోన్న పనులు, సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ విద్యుత్, తాగునీరు, డ్రెయినేజీ వంటి మౌలిక సౌకర్యాలు కల్పించి టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలన్నారు. జగనన్న ఇళ్ల కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలం కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఉచితంగా లబ్ధిదారులకు ఇవ్వాలని కోరారు. ఇసుక, ఐరన్, సిమ్మెంటు ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అక్కినేని వనజ, డేగా ప్రభాకర్, మన్నవ కృష్ణ చైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బండి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి హేమశంకర్, పొటేలు పెంటయ్య, పుప్పాల కన్నబాబు, కొండేటి బేబి, కుంచే వసంతరావు, మావూరి విజయ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయరాజు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దేవదాయ శాఖ ఆస్తుల్లో ఎటువంటి చర్యలు చేపట్టాలన్నా ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరని ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయరాజు పేర్కొన్నారు. ఇటీవల స్థానిక ఏలూరు సంస్కృతవేద పాఠశాలలో గోవులను ఉంచే విషయంలో వేద పాఠశాల నిర్వాహకులకు, కార్యనిర్వహణాధికారికి మధ్య తలెత్తిన వివాదంపై ఆయన విచారణ కోసం వేదపాఠశాలకు శనివారం విచ్చేశారు. వేదపాఠశాల నిర్వహణకు 508 గజాల స్థలాన్ని 33 ఏళ్లకు లీజుకు, ఈ పాఠశాల ప్రాంగణంలో ఉన్న మరో 600 గజాల స్థలాన్ని లీజుకు ఇచ్చినట్లు ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో లేదని తెలిపారు. విచారణ నివేదికను దేవదాయ శాఖకు నివేదిక సమర్పిస్తామన్నారు. వేదాలను, వేద విద్యార్థులను పరిపుష్టం చేయాలనేది దేవదాయ శాఖలో ఒక భాగమని చెప్పారు. ఈ పాఠశాల నిర్మాణానికి 2016లో దేవదాయ శాఖకు చెందిన కామన్ గుడ్‌ఫండ్ నుంచి రూ.40 లక్షలు, సత్రానికి చెందిన రూ.10 లక్షలు, అర్చక వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేసి పాఠశాలకు కొత్త భవనాన్ని నిర్మించామన్నారు. ఇటీవల నిర్వహించిన ధార్మిక పరిషత్ సమావేశంలో దేవదాయానికి సంబంధించిన స్థలాలను 11 సంవత్సరాలకు మాత్రమే లీజుకు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వేదపాఠశాల ప్రతినిధులు పాఠశాల ఆవరణలోని 600 గజాల స్థలాన్ని సైతం లీజుకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయరాజుకు వినతిపత్రం అందజేశారు.

కొల్లేరు రోడ్డు ఆక్రమణపై ఆగ్రహం



కొక్కిరాయిలంక, పైడిచింతపాడు మధ్య రోడ్డు ఆక్రమణపై ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

ఏలూరు రూరల్ : చేపల చెరువుల యజమానులు కొల్లేరు రోడ్డు ఆక్రమించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఉదయం పైడిచింతపాడు సర్పంచ్ తిమోతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముంగర సంజీవ్ కుమార్, పల్లెం ప్రసాద్, బీసీ, ఎస్సీ గ్రామ పెద్దలు పైడిచింతపాడు, కొక్కిరాయిలంక మధ్య రోడ్డులో చేపల చెరువుల యజమానులు కంచె వేయడంపై ప్రశ్నించారు. రోడ్డు ఆక్రమించి కంచె వేయడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. చెరువులో నీరు రోడ్డుపై నుంచి పారడం వల్ల బురద అవుతోందని లీజుదారులను నిలదీశారు. సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి కొల్లేరు రోడ్డు అభివృద్ధి చేస్తోంటే, కొందరు చెరువుల యజమానులు 10 నుంచి 20 అడుగల మేరకు రోడ్డు ఆక్రమించడం అన్యాయమన్నారు. తక్షణం ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	26	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	54
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	28	ములక్కాడలు	10–12
బెండకాయలు	46	కంద	36
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	36
కాకర కాయలు	24–28	కీరా దోస	44
బీరకాయలు	34	ఫ్రెంచ్‌బీన్స్	60
బీరకాయలు (పందిరి)	50	అల్లం	68
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	36	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	26	గోంగూర	08
గోరుచిక్కుడు	36	పుదీనా	05
దోసకాయలు	34	బఠాణి	60
అనబకాయ (1)	20–25	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	36

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	00
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	01
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	03
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	01
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	00
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	00
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	09
ఏలూరు –తిరుపతి	16.00	4830	31
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	00
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	00
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.10	98513	32
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.40	985037	32

నారాయణ విద్యాసంస్థలపై ఫిర్యాదు



జిల్లా విద్యాశాఖాధికారికి వినతిపత్రం అందిస్తున్న అంబేద్కర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నారాయణ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దిద్దే అంబేద్కర్ జిల్లా విద్యాశాఖాధికారి డి.మధుసూధనరావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఆదివారం సెలవుదినం అయినప్పటికీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా ఉన్న నారాయణ విద్యా సంస్థల ఉపాధ్యాయులను ఏలూరు నగరానికి రప్పించి వీధుల వెంట తిప్పి వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థులను నారాయణ విద్యా సంస్థల్లో చేర్చాలని ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. ఇంటింటికీ తిరిగి అడ్మిషన్లు చేయడానికి నిరాకరించిన వారికి జీతాలు చెల్లించకుండా, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. అధిక ఫీజుల వసూలు, పరిమితికి మించి ఎక్కువ గంటలు తరగతులు నిర్వహించడం, సెలవు రోజుల్లోనూ తరగతులు నిర్వహించడం సిబ్బందికి తగిన వేతనాలు చెల్లించకపోవడం వంటి అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అనేకసార్లు నారాయణ విద్యా సంస్థల అక్రమాలపై విద్యాశాఖ అధికారులుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఆదివారం వీధుల వెంట తిప్పే కార్యక్రమాన్ని అడ్డుకోవాలని వినతిపత్రంలో కోరారు.

లెనిన్‌కు ఘన నివాళి



లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): మానవ వనరులన్నీ అందరికీ అందుబాటులో ఉండాలనే ఉన్నతమైన లక్ష్యంగా జీవించిన కామ్రేడ్ లెనిన్ జీవితం ధన్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో లెనిన్ 99వ వర్ధంతిని పురస్కరించుకుని పి.కిషోర్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యక్రమంలో రవి మాట్లాడారు. ప్రతి మనిషికి శ్రమకు తగ్గ ఫలితం అందాలన్నారు. కారల్ మార్క్స్, ఏంగెల్స్ ఆశయాన్ని ఆచరణలో తీసుకొచ్చిన మహనీయుడు లెనిన్ అని కొనియాడారు. ఆయన ఈ ప్రపంచంలోనే భూతల స్వర్గాన్ని సోవియట్ రష్యాలో నిర్మించి చూపించిన వ్యక్తి అని గుర్తు చేశారు. లెనిన్ నాయకత్వాన్ని కార్మిక, కర్షక, ప్రజలు బలపర్చినందునే రష్యాలో రాచరికాన్ని, పెట్టుబడిదారీ వ్యవస్థను కూల్చి సమసమాజాన్ని నిర్మించుకున్నారని వివరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎ.శ్యామలరాణి, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, లెనిన్, ప్రసాద్, నాగరాజు, సీతారాం, షాజీమా, ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ శాశ్వత అమలుకు చట్టం చేయాలి

ఏలూరు (టూటౌన్): ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను శాశ్వతంగా అమలు చేసే విధంగా చట్టం చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాటి సీఎం ఎన్ కిరణ్ కుమార్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను యాక్ట్ నెంబరు వన్ ఆఫ్ 2013 చట్టం చేశారని, దీని కాలపరిమితి 10 సంవత్సరాలు మాత్రమే అని తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత సబ్ ప్లాన్ చట్టం పూర్తి స్థాయిలో అమలు కాలేదని పేర్కొన్నారు. సబ్ ప్లాన్ శాశ్వతంగా అమలయ్యేవిధంగా చూడాలని సంతోష్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు.

మందులు కొనుగోలుకు ఆర్థిక సాయం

పెదపాడు: బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న ఓ వృద్ధురాలికి మందుల కొనుగోలు నిమిత్తం రూ.5వేల ఆర్థిక సాయాన్ని పెదపాడు మండలంలోని అప్పనవీడు మానవత శాఖ సభ్యులు అందించారు. అప్పనవీడులో సమీపంలోని ఇందిరానగర్‌కు చెందిన తిరుమలశెట్టి అన్నపూర్ణ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే ఈమెకు బ్రెయిన్ ట్యూమర్ వచ్చింది. దీంతో ఆర్థికంగా ఇబ్బందుపడుతున్న ఆమెకు మానవత చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు చేతులమీదుగా అందించారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి బెజవాడ శ్రీరామ్మూర్తి, కన్వీనర్ ఘంటా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు జీ జయరామందరరావు పాల్గొన్నారు.


26న కాంగ్రెస్ పాదయాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న గురునాథరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా చేపట్టిన భారత్‌జోడో యాత్ర ఈ నెల 30వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు చేయిచేయి కలుపుదాం.. రాహుల్ గాంధీని బలపరుద్దాం అనే నినాదంతో ఈ నెల 26వ తేదీన రిపబ్లిక్ డే రోజున నగరంలో జిల్లా స్థాయిలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెట్టి గురునాథరావు పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన కాంగ్రెస్ ఏలూరు నగర అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశంలో పాదయాత్ర రాష్ట్ర కోఆర్డినేటర్ పాతపాటి హరికుమార్ రాజు, రాయల సతీష్, పాకలపాటి భీమేశ్వరరావు, పైడిముక్కల మురళీకృష్ణ, మంగినేడి బాబ్జి, కట్టా నాగరాజు గౌడ్, చేబత్తుల వెంకటరత్నం, ముప్పిడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకటాద్రి మృతి తీరని లోటు



వెంకటాద్రి (ఫైల్)

ఏలూరు (టూటౌన్): బహు గ్రంథ రచయిత, హేతువాద ఉద్యమ నాయకుడు రావిపూడి వెంకటాద్రి మృతి హేతువాద ఉద్యమానికి తీరని లోటని ఏపీ హేతువాద సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రామాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 100 గ్రంథాలకు పైగా హేతువాద ఉద్యమంపై రచనలు చేసిన వెంకటాద్రి 20 ఏళ్ల వయస్సునుంచే హేతువాద ఉద్యమంలో పనిచేశారని తెలిపారు. ప్రముఖ నాస్తికోద్యమ నాయకులు పెరియార్ రామస్వామి నాయకర్, అన్నా దొరయ్‌లను తన స్వగ్రామం నాగండ్ల రప్పించి కార్యక్రమాలు చేయించిన గొప్ప వ్యక్తి వెంకటాద్రి అని వివరించారు.

గోపన్నపాలెంలో హౌసింగ్ డే

దెందులూరు: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులంతా త్వరితగతిన ఇళ్ల నిర్మాణం ప్రారంభించి పూర్తి చేయాలని ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి, వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. శనివారం గోపన్నపాలెంలో సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ అధ్యక్షతన హౌసింగ్ ఏఈ దివ్య ఆధ్వర్యంలో హౌసింగ్ డే నిర్వహించారు. ఇళ్ల లబ్ధిదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.